

# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 04-08-2026 | సంపుటి - 31 | సంచిక - 71 | రూ : 4 | పేజీలు: 8

## 6 నెలల్లో ప్రాజెక్టులకు
# అనుమతులు సాధించాలి
### పాలమూరు, సీతారామ, డిండి, గౌరవెల్లిలకు ప్రాధాన్యం

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- పోలవరం పూర్తికాక ముందే ఉమ్మడి ఖమ్మంలో ముంపును గుర్తించాలి: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: పాలమూరురంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులను వీలైనంత త్వరగా సాధించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. ఆరు నెలల్లో అనుమతులు సాధ్యమయ్యేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాలను తెరిచిందని చెప్పారు. సోమవారం సచివాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులతో కలసి ఉత్తమ్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గతంలో కేంద్ర సంస్థల నుంచి తిరస్కరణకు గురైన ఈ నాలుగు ప్రాజెక్టుల ప్రతిపాదనలను సరిదిద్ది తిరిగి సమర్పించాలి.



సుప్రీం తాజా తీర్పు వెనుక రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సాగించిన న్యాయపోరాటం ఉంది. పర్యావరణ అనుమతులు సాధించేలా ప్రతి ప్రాజెక్టుకు ఒక నోడల్ అధికారిని నియమించాలి. గౌరవెల్లి పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో నిర్వహణకు సిద్ధంగా ఉంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి. సీతారామ సాగర్‌కు అవసరమైన పర్యావరణ పత్రాలను ఏమాత్రం ఆలస్యం లేకుండా నవీకరించాలి. ఆమోదం లభించగానే పనులు ప్రారంభించేలా అన్నీ సిద్ధం చేసుకోవాలి. పాలమూరు రంగారెడ్డి, డిండిలకు పర్యావరణ అనుమతులు వచ్చేలా చూడాలి. పోలవరం వెనుక జలాల ప్రభావాన్ని సమర్థంగా అంచనా తరువాయి 2లో



## పారిశ్రామిక పార్కుతో
# యువతకు ఉద్యోగాలు

- మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ) : పారిశ్రామిక పార్కు ఏర్పాటుతో యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ పరిధి మేడిపల్లి శివారులో సుమారు 250 ఎకరాల్లో ప్రతిపాదిత పారిశ్రామిక పార్కు, కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని కంపెనీ ప్రతినిధులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పరిశ్రమకు భూములిచ్చిన రైతులను అన్ని విధాలా ఆదుకొంటామన్నారు. రామగిరి ఖిల్లాకు రోప్‌వేకు ప్రతిపాదనలు పంపించామని, త్వరలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం సమీపంలో నిర్మిస్తున్న జాతీయ రహదారిని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ శ్రీహర్ష, ఆర్డీవో సురేశ్, కంపెనీ ప్రతినిధులు ముకుంద త్రివేది, విజయ్‌కుమార్, పవన్‌కుమార్, మనోజ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్తంభించిన పార్లమెంట్




- నీట్ పేపర్ లీక్, అయోధ్య రామాలయ విరాళాల
- చోరీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళన
- నిరసనల మధ్యే ఉభయ సభల్లో రెండు బిల్లులు
- ఎలాంటి చర్చ లేకుండానే

### మూజువాణి ఓటుతో ఆమోదం

న్యూఢిల్లీ బ్యూరో : నీట్ పేపర్ లీకేజీ, అయోధ్య రామాలయ విరాళాల చోరీ ఘటనలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంట్ స్తంభించింది. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన అణచివేతకు హోం మంత్రి సరైన వివరణ ఇచ్చే వరకు పార్లమెంటులో తమ ఆందోళనను కొనసాగిస్తామని ప్రతిపక్షం పేర్కొంది. ఈ డిమాండ్ తో లోక్‌సభ, రాజ్యసభలలో ప్రతిపక్షాలు ఏకతాటిపైకి వచ్చి ఆందోళన చేయడంతో సభా కార్యకలాపాలకు పలుమార్లు అంతరాయం ఏర్పడింది. జంతర్ మంతర్ వద్ద పోలీసుల అరాచకాలకు, అయోధ్యలోని తరువాయి 2లో

## అయోధ్య ట్రస్ట్‌లో మరో కీలక పరిణామం..
# తప్పుకున్న ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత



- రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బాధ్యతల నుంచి వైదొలిగిన భయ్యాజీ జోషి
- విరాళాల దొంగతనం వివాదం నేపథ్యంలో ట్రస్ట్‌లో కీలక మార్పులు
- అనారోగ్య కారణాలు చూపుతూ తప్పుకున్న భయ్యాజీ జోషి
- ఆర్ఎస్ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ నేత జోషి

2లో

## నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు..
# దేశంలోనే కొత్త రికార్డ్!
### మూడేళ్ల లోపే ఈ మైలురాయిని అందుకున్న ఆసుపత్రి



- ప్రభుత్వ ఆసుపత్రుల్లో దేశంలోనే ఇదొక కొత్త బెంచ్‌మార్క్
- 90 శాతం సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కింద ఉచితంగా నిర్వహణ
- నిమ్స్ బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్య మంత్రి దామోదర

2లో

## అది సూసైడ్ నోట్ కాదు
# కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జీషీట్

- భవనాలే కాదు రాజకీయంగా సమాధి కట్టడమూ తెలుసు
- 89 కేసులున్న సీఎం రేవంత్‌రెడ్డి క్రిమినల్ వేస్ట్
- నిరుద్యోగులు బలవన్మరణాలకు పాల్పడొద్దు
- 2 లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలి
- ప్రభుత్వ ఒత్తిడి వల్లే పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణం
- అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు జరపాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్



2లో

## ప్రపంచంలోనే అతిపెద్ద కెమెరాతో అంతరిక్ష అద్భుతం..
# కళ్లుచెదిరే కొత్త చిత్రం విడుదల

- ప్రపంచంలోనే అతిపెద్ద కెమెరాతో 5 లక్షల గెలాక్సీల చిత్రాన్ని తీసిన శాస్త్రవేత్తలు
- చిలీలోని వెరా సి. రూబిన్ అబ్జర్వేటరీలో ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతం
- పదేళ్లపాటు కొనసాగే 'లెగసీ సర్వే ఆఫ్ స్పేస్ అండ్ టైమ్' ప్రాజెక్టులో ఇది భాగం
- చిలీలోని తుఫాను బాధితులకు ఈ చిత్రాన్ని అంకితం చేసిన శాస్త్రవేత్తలు

# అది సూసైడ్ నోట్ కాదు కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జీషీట్

హైదరాబాద్ : ఉద్యోగాలకు నోటిఫికేషన్లు రాక ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురానికి చెందిన గడ్డం వేణు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడం బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. ఆయన విడుదల చేసింది సూసైడ్ నోట్ కాదనీ, రాష్ట్ర ప్రభుత్వంపై చార్జీషీట్ వంటిదని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 89 కేసులున్న రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడమే కాంగ్రెస్ పార్టీ చేసిన "క్రిమినల్ వేస్ట్"అని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు, నిరుద్యోగులను మోసం చేసినందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 16,978 ఉద్యోగాలనే మాత్రమే భర్తీ చేసిందన్నారు. అందులోనూ బీఆర్ఎస్ ఇచ్చిన నోటిఫికేషన్లను తీసేస్తే 10 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని వివరించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో సమాధానం చెప్పాలని రాహుల్‌గాంధీని, రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి సాధించిన విజయం అంటే 150 మంది గురుకుల విద్యార్థుల మరణాలా? లేక ఉద్యోగాలు అడిగిన నిరుద్యోగులకు "ఎండ్రిన్ తాగి చావండి" అనే పరిస్థితి కల్పించడమా?అని ప్రశ్నించారు. 21 ఏండ్లకే చట్టసభల్లో ప్రవేశానికి అవకాశం కల్పించాలంటూ మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి ఆ బాధ్యతలను యువకుడికి అప్పగించాలని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రజల దృష్టి మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చేతిలో లేని అంశాలపై మాట్లాడుతున్నారని విమర్శించారు. 21 ఏండ్ల అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసినా అది ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండబోదని స్పష్టం చేశారు.

### అయోధ్య ట్రస్ట్‌లో మరో కీలక పరిణామం..

## తప్పుకున్న ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత

అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత సురేశ్ భయ్యాజీ జోషి ట్రస్ట్ సంరక్షకుడి బాధ్యతల నుంచి వైదొలగారు. రామ మందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం, నిధుల మళ్లింపు ఆరోపణలపై వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. అయితే, తాను అనారోగ్య కారణాలతోనే పదవి నుంచి తప్పుకుంటున్నట్లు 78 ఏళ్ల జోషి స్పష్టం చేశారు. 2026 జూన్ లో వెలుగులోకి వచ్చిన విరాళాల అక్రమాల ఆరోపణలతో ట్రస్ట్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నగదు కానుకల నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి దాదాపు రూ. 80 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివాదానికి నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా ఇప్పటికే తమ పదవులకు రాజీనామా చేశారు. భయ్యాజీ జోషి 2009 నుంచి 2021 వరకు ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. గతంలో రామజన్మభూమికి సంబంధించిన భూముల కొనుగోళ్లలో అవకతవకల ఆరోపణలు వచ్చినప్పుడు ఆయన్ను ట్రస్ట్ పాట్రన్‌గా నియమించారు. ఆయన పాత్ర ప్రధానంగా తెరవెనుక సలహాలకే పరిమితమైంది. విరాళాల వివాదం పార్లమెంటులోనూ అధికార, విపక్షాల మధ్య తీవ్ర చర్చకు దారితీయగా, పారదర్శక విచారణకు సహకరిస్తామని, విరాళాల నిర్వహణలో సంస్కరణలు చేపడుతున్నామని ట్రస్ట్ ప్రకటించింది.

### ఇదిగో.. నా స్కాలర్‌షిప్ లెటర్..

## చదువుకోండి: అభిజీత్ దీప్కే

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కుటుంబ ఆర్థిక స్థితిపై విచారణ జరపాలని ఆర్టీఐ కార్యకర్త ఫిర్యాదు చేసిన ఒక్క రోజులోనే అభిజిత్ ఈ విషయంపై స్పందించారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో తన ఉన్నత చదువుకు స్కాలర్‌షిప్, ఎడ్యుకేషన్ లోన్ మాత్రమే ఆధారం అని ఆయన స్పష్టం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ బర్ఖా దత్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన విదేశీ చదువు వెనుక కుటుంబానికి లెక్కల్లో చూపని ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. "నా చదువుకు బోస్టన్ యూనివర్సిటీ ఇచ్చిన స్కాలర్‌షిప్ సాయపడింది. కొంత ఎడ్యుకేషన్ లోన్ కూడా తీసుకున్నా. దాన్ని ఇప్పుడు తిరిగి చెల్లించాల్సి ఉంది" అని చెబుతూ తన స్కాలర్‌షిప్ లెటర్‌ను చూపించారు. సూరత్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త అమిత్ తివారీ, ఆగస్టు 1న మహారాష్ట్ర ప్రభుత్వం సహా పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీప్కే తండ్రి, మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఐడీసీ)లో రిటైర్డ్ జూనియర్ ఇంజనీర్‌గా నెలకు రూ. 60,00065,000 జీతంతో తన పిల్లలను అమెరికాకు ఎలా పంపగలరని ప్రశ్నించారు. భవిష్యత్తులో పార్టీ కార్యకలాపాలకు నిధుల గురించి కూడా దీప్కే మాట్లాడారు. "సీజేపీ ముందు ముందు క్రౌడ్ ఫండింగ్ చేస్తుంది. ప్రజల నుంచి డబ్బు అడుగుతాం, ఈ విషయంలో చాలా పారదర్శకంగా ఉంటాం" అని తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యతిరేక ఆందోళనల సమయంలో కొందరు ఢిల్లీ పోలీసులు కూడా తమకు రహస్యంగా మద్దతు తెలిపి వాటర్ బాటిళ్లు అందించారని తెలిపారు.

## స్తంభించిన పార్లమెంట్

న్యూఢిల్లీ బ్యూరో : నీట్ పేపర్ లీకేజీ, అయోధ్య రామాలయ విరాళాల చోరీ ఘటనలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంట్ స్తంభించింది. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన అణచివేతకు హోం మంత్రి సరైన వివరణ ఇచ్చే వరకు పార్లమెంటులో తమ ఆందోళనను కొనసాగిస్తామని ప్రతిపక్షం పేర్కొంది. ఈ డిమాండ్ తో లోక్‌సభ, రాజ్యసభలలో ప్రతిపక్షాలు ఏకతాటిపైకి వచ్చి ఆందోళన చేయడంతో సభా కార్యకలాపాలకు పలుమార్లు అంతరా యం ఏర్పడింది. జంతర్ మంతర్ వద్ద పోలీసుల అరాచకాలకు, అయోధ్యలోని రామ మందిర దోపిడీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు పార్లమెంటు వెలుపలా నిరసన తెలిపాయి. 'అమిత్ షా పార్లమెంటుకు ఎందుకు రావడం లేదు?' అంటూ రాసి ఉన్న పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించడంతో పాటు ప్లకార్డులతో ఆందోళన చేపట్టాయి. వర్షాకాల సమావేశాలు మూడో వారంలోకి ప్రవేశించినప్పటికీ ఉభయ సభలలో ప్రతిపక్షాలు కొనసాగిస్తున్న ఆందోళన కేంద్ర ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించాయి. ఈ భారీ నిరసనల మధ్యే ప్రధాన న్యాయమూర్తితో సహా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచే చట్ట సవరణ లోక్‌సభలో ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. అదే విధంగా ప్రతిపక్షాల నిరసనల మధ్యే రాజ్యసభలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. సంయుక్త పార్లమెంటరీ కమిటీ సహకార (సవరణ) చట్టానికి మద్దతుగా తన నివేదికను సమర్పించింది. స్వల్ప మార్పులతో ఈ బిల్లును చట్టంగా మార్చాలని జేపీసీ సిఫారసు చేసింది. లోక్‌సభలో, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్ స్తంభించిన పార్లమెంట్ సవరణ బిల్లు, కేంద్ర సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్.. ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ బిల్లును ప్రవేశపెట్టారు. ఇది బ్యాంకు రికార్డులను కోర్టులో విశ్వసనీయ సాక్ష్యంగా స్వీకరించడానికి అనుమతిస్తుంది. 1891 నాటి చట్టం స్థానంలో వచ్చిన ఈ కొత్త చట్టంలో, డిజిటల్, ఎలక్ట్రానిక్, వర్చువల్ రికార్డులను బ్యాంకు రికార్డులుగా చేర్చడానికి నిబంధనలు ఉన్నాయి. ఇదిలా ఉండగా లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మెన్ ఉభయ సభలలో ప్రతిపక్షాల నిరసనలను అణచివేసేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. జంతర్ మంతర్ వద్ద పోలీసుల చర్య, అయోధ్యలో దారుణాలపై వివరంగా చర్చించకుండా నిరసనల నుంచి వెనక్కి తగ్గబోమని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. నిరసనలు తీవ్రతరం కావడంతో ఉభయ సభలను నేటికి వాయిదా వేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా భవిష్యత్ నిరసనల కోసం ప్రణాళికలు రూపొందించడానికి ఇండియా బ్లాక్ ఎంపీలు సమావేశమయ్యారు.


**పార్లమెంట్ లో ఆందోళన**

అయోధ్యలోని రామమందిర విరాళాల చోరీపై ప్రతిపక్ష ఎంపీలు సోమవారం కూడా ఆందోళన కొనసాగించారు. రామ మందిరం విరాళాల చోరీతో పాటు విద్యార్థి నిరసనకారుల పట్ల పోలీసుల బలప్రయోగంపై పార్లమెంట్ ప్రాంగణంలోని మకర ద్వారం ఎదుట నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, శివదాసన్, ఎస్పీకి చెందిన డింపుల్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, టీఎంసీకి చెందిన మహువా మొయిత్రా, జెఎంఎంకు చెందిన మహువా మాఝీ, ఆర్ఎస్పీకి చెందిన ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ తదితర ఎంపీలు ఈ నిరసనలో పాల్గొన్నారు. రామమందిరంలో విరాళాల చోరీకి ప్రతీకగా విరాళాల పెట్టెలను పార్లమెంట్ ఆవరణలో ఉంచారు.

## నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు.. దేశంలోనే కొత్త రికార్డ్!

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్య రంగంలో అరుదైన మైలురాయిని అధిగమించింది. మూడేళ్ల కంటే తక్కువ వ్యవధిలోనే 1000 రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ఇదొక నూతన రికార్డు అని, సామాన్యులకు సైతం అత్యాధునిక రోబోటిక్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రభుత్వం పేర్కొంది. ఈ అద్భుత ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్, యూరాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియాలజీ, నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (నిమ్స్ పాలకమండలి అధ్యక్షుడు) ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 1000 శస్త్రచికిత్సలలో యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 248, సర్జికల్ ఆంకాలజీ 162 సర్జరీలు నిర్వహించాయి. వీటిలో 90 శాతానికి పైగా ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాల ద్వారా ఉచితంగా అందించడం గమనార్హం. రాడికల్ ప్రోస్టేటెక్టమీ, రాడికల్ సిస్టెక్టమీ, క్లిష్టమైన రోబోటిక్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రోబోటిక్ శస్త్రచికిత్సల వల్ల కచ్చితత్వం మెరుగుపడుతుందని, శస్త్రచికిత్స అనంతరం నొప్పి, రక్తస్రావం తగ్గడంతో పాటు రోగులు వేగంగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. సామాన్య పౌరులకు అత్యుత్తమ వైద్య సేవలను చేరువ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొంటూ నిమ్స్ బృందాన్ని ప్రశంసించారు.

## ప్రపంచంలోనే అతిపెద్ద కెమెరాతో అంతరిక్ష అద్భుతం..



ఖగోళ శాస్త్రవేత్తలు విశ్వానికి సంబంధించిన ఒక అద్భుతమైన, అత్యంత స్పష్టమైన చిత్రాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. ఇందులో 5 లక్షలకు పైగా గెలాక్సీలు, 50,000 నక్షత్రాలు నిక్షిప్తమై ఉన్నాయి. ప్రపంచంలోనే ఇప్పటివరకు నిర్మించిన అతిపెద్ద డిజిటల్ కెమెరా అయిన 3200మెగాపిక్సెల్ ఎల్ఎస్ఎస్‌టీ కెమెరా సహాయంతో ఈ చిత్రాన్ని బంధించారు.

ఈ భారీ కెమెరా చిలీలోని వెరా సి. రూబిన్ అబ్జర్వేటరీలో ఉంది. సుమారు ఒక చిన్న కారు పరిమాణంలో, దాదాపు 3000 కిలోల బరువుతో ఉండే ఈ కెమెరాను అక్కడి 8.4 మీటర్ల సిమోనీ సర్వే టెలిస్కోప్‌కు అమర్చారు. నెలల తరబడి వందలాది చిత్రాలను తీసి, వాటన్నింటినీ ఒకదానితో ఒకటి కలపడం ద్వారా ఈ తుది చిత్రాన్ని రూపొందించారు. ఈ ప్రక్రియ వల్ల చాలా దూరంలో ఉన్న మసక కాంతి కూడా ఎంతో స్పష్టంగా కనిపించి, విశ్వంలోని నిర్మాణాలు వివరంగా ఆవిష్కృతమయ్యాయి.

మన పాలపుంతకు చాలా దూరంలో ఉన్న 'కాస్మోస్' (COSMOS) అనే సువిశాల అంతరిక్ష ప్రాంతాన్ని ఈ కెమెరా లక్ష్యంగా చేసుకుంది. ఈ ప్రాంతం నుంచి విశ్వాన్ని మరింత స్పష్టంగా చూసేందుకు వీలుంటుంది. ఈ చిత్రంలో సర్పిలాకార, దీర్ఘవృత్తాకార గెలాక్సీలతో పాటు, ఒకదానితో ఒకటి ఢీకొంటున్న గెలాక్సీలు, పురాతన గెలాక్సీలు కూడా కనిపిస్తున్నాయి. ఈ మైలురాయి 'లెగసీ సర్వే ఆఫ్ స్పేస్ అండ్ టైమ్' (ఎల్ఎస్ఎస్‌టీ) అనే పదేళ్ల ప్రాజెక్టులో భాగం. ఈ దశాబ్ద కాలంలో ఈ కెమెరా దక్షిణార్ధ గోళంలోని ఆకాశాన్ని నిరంతరం స్కాన్ చేసి, కోట్ల సంఖ్యలో ఖగోళ వస్తువులను మ్యాపింగ్ చేయనుంది. "ఇది రూబిన్ అబ్జర్వేటరీకి ఆరంభం మాత్రమే. రాబోయే కొన్నేళ్లలో ఈ ప్రాంతాన్ని పదేపదే పరిశీలించడం ద్వారా సూపర్‌నోవాల వంటి అనేక మార్పులను గుర్తించవచ్చు" అని అబ్జర్వేటరీ డైరెక్టర్ బాబ్ బ్లమ్ తెలిపారు. ఇటీవల చిలీలోని కోక్వింబో ప్రాంతాన్ని తుపానులు అతలాకుతలం చేసిన నేపథ్యంలో, అక్కడి ప్రజలకు సంఘీభావంగా ఈ చిత్రాన్ని అంకితం చేస్తున్నట్లు బాబ్ బ్లమ్ ప్రకటించారు. "దశాబ్దాలుగా మాకు మద్దతు ఇస్తున్న ఆ ప్రాంత ప్రజలకు కృతజ్ఞతగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

## 6 నెలల్లో ప్రాజెక్టులకు అనుమతులు సాధించాలి

హైదరాబాద్: పాలమూరు రంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులను వీలైనంత త్వరగా సాధించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. ఆరు నెలల్లో అనుమతులు సాధ్యమయ్యేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాలను తెరిచిందని చెప్పారు. సోమవారం సచివాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులతో కలిసి ఉత్తమ్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గతంలో కేంద్ర సంస్థల నుంచి తిరస్కరణకు గురైన ఈ నాలుగు ప్రాజెక్టుల ప్రతిపాదనలను సరిదిద్ది తిరిగి సమర్పించాలి. సుప్రీం తాజా తీర్పు వెనుక రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సాగించిన న్యాయపోరాటం ఉంది. పర్యావరణ అనుమతులు సాధించేలా ప్రతి ప్రాజెక్టుకు ఒక నోడల్ అధికారిని నియమించాలి. గౌరవెల్లి పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో నిర్వహణకు సిద్ధంగా ఉంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి. సీతారామ సాగర్‌కు అవసరమైన పర్యావరణ పత్రాలను ఏమాత్రం ఆలస్యం లేకుండా నవీకరించాలి. ఆమోదం లభించగానే పనులు ప్రారంభించేలా అన్నీ సిద్ధం చేసుకోవాలి. పాలమూరురంగారెడ్డి, డిండిలకు పర్యావరణ అనుమతులు వచ్చేలా చూడాలి. పోలవరం వెనుక జలాల ప్రభావాన్ని సమర్థంగా అంచనా వేయాలి' అని పేర్కొన్నారు.

* **వీలైనంత త్వరగా సీతమ్మ సాగర్: పొంగులేటి**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 'పోలవరం ప్రాజెక్టు పూర్తయి వినియోగంలోకి వచ్చేలోపే ఉమ్మడి ఖమ్మం జిల్లాపై వెనుక జలాల ప్రభావం ఎంతవరకు ఉంటుందో స్పష్టంగా అంచనా వేయాలి. ఆ వివరాలను కేంద్ర సంస్థల ఎదుట ఉంచాలి. బ్యాక్‌వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, మౌలిక వసతులు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత కేంద్ర సంస్థలదే. మరోవైపు సీతమ్మసాగర్ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. అది పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ రంగానికి కొత్త ఊపు వస్తుంది' అని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ స్పందిస్తూ పోలవరం ముంపుపై శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని సూచించారు. ఈఎన్సీలు రమేశ్‌బాబు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## "మిస్టర్ డ్రామారావు" అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

- **పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఆరోపణ**
- **పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించారని విమర్శ**
- **అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి**
- **వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య**



తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం 'ఎక్స్' వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న 'మిస్టర్ డ్రామారావు' కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్‌రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.

# సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించేవరకు పోరాటం ఆగదు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించే వరకు తమ పోరాటం ఆగదని సూర్యాపేట రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్, కో కన్వీనర్ రాచూరి ప్రతాప్, డాక్టర్ రమేష్ చంద్ర , అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ గ్రాండ్ ఎదురుగా ఉన్న కార్యాలయం వద్ద రైల్వే మార్గం మరియు సూర్యాపేట మీదుగా హైస్పీడు రైల్ కోసం ప్రజా పిలుపు కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఇప్పటికే రైల్వే సౌకర్యం కొరకు ప్రజా సంఘాలు, సామాజిక శక్తులతో, మేధావులతో, సూర్యాపేట ప్రగతిని కాంక్షించే వారితో కమిటీ వేశామని రైల్వే సాధన సమితి ని ఏకతాటిగా తీసుకొచ్చి రైల్వే సౌకర్యం సాధించేవరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. సూర్యాపేట ప్రజలు సంఘీభావం తెలిపి రైల్వే సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైల్వే సాధన కొరకు సంతకాల సేకరణ కూడా నిర్వహించామని పేర్కొన్నారు. విద్యార్థులతో కలిసి ర్యాలి నిర్వహిస్తామని, సత్యాగ్రహ దీక్షలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రంగారెడ్డి, గౌరవ సలహాదారులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, లింగంపల్లి భద్రయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తలమల్ల హస్సేన్, డాక్టర్ రమేష్ చంద్ర, మామిడి అంజయ్య, బికుమల్ల ఉపేందర్, నల్లపాటి అప్పారావు, తొగిటి మురళి, నల్లకుంట్ల అయోధ్య, రిటైర్డ్ టీచర్ నరసయ్య, సముద్రాల రాంబాబు, మంజుల, తోట శ్యాంప్రసాద్,పోతరాజు నరసయ్య,నారబోయిన వెంకట యాదవ్,ఎర్ర అఖిల్ ,అక్కినపల్లి రాము, రాచూరి సీతారాములు,తదితరులు పాల్గొన్నారు.

## గోలిగూడెం అంగన్ వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : మండల పరిధిలోని గోలిగూడెం అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు అంగన్వాడీ టీచర్ వై పుణ్యావతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్స్ పిన్నింటి ఉమారాణి, ఆశా వర్కర్ సిహెచ్ అచ్చమ్మ గర్భిణీలు, బాలింతలు హాజరయ్యారు. తల్లి గర్భం దాల్చిన నుండి తొమ్మిది నెలల వరకు సమతుల ఆహారము తీసుకోవాలని డెలివరీ అయిన వెంటనే తల్లి నుండి వచ్చే పాలు ముర్రుపాలు అంటారు ఆ పాలు బిడ్డకు గంటలోపు పట్టేయాలి ఆ పాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది అని తల్లులకు వివరించారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 113 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 65 , జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 15, మున్సిపాలిటీ 7, సర్వే ల్యాండ్స్ 4, సంక్షేమ శాఖ 3, వైద్య ఆరోగ్య శాఖ 3, ఇరిగేషన్ 2, డి. సి.ఓ (TGSWREI) 2, డి.పి.ఓ 2, వ్యవసాయ, విద్య, మైన్స్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్ అండ్ బి , మార్కెటింగ్, హౌసింగ్, సివిల్ సప్లై, జిఎం ఇండస్ట్రీస్, పశుసంవర్ధక శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, డిప్యూటీ కలెక్టర్ కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ వెంటనే పూర్తి చేయాలి



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఎస్ ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాదు నుంచి సోమవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియ మొత్తాన్ని పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. ఎటువంటి తప్పులు దొర్లకుండా డిజిటలైజేషన్ చేపట్టాలన్నారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియలపై జిల్లాల వారిగా సమీక్షించారు. ఒకే కుటుంబానికి చెందిన కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు ఉంటే, వారిని ఒకే పోలింగ్ కేంద్రం కిందకు వచ్చేలా రేషనలైజేషన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆర్.ఎస్.చిత్రు, డిఆర్ఓ స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**: జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం సంబంధిత అధికారుల ప్రాథమిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను ఆయన స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, పెన్షన్లు, ఉపాధి హామీ పథకం, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 109 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని సూచించారు.

## విషాదంలోనూ మానవత్వాన్ని చాటిన అవయవదాతల కుటుంబాలకు జిల్లా కలెక్టర్ ఘన సన్మానం



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని, అవయవదానం పట్ల సమాజంలో మరింత అవగాహన కల్పించి, మరణానంతరం కూడా అనేక మంది జీవితాలకు వెలుగునిచ్చిన అవయవదాతల కుటుంబాలను గౌరవించాలనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ , లయన్స్ క్లబ్ నల్గొండ ఆధ్వర్యంలో, నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హృద్యమైన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నల్గొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ముందుగా అవయవదాన ప్రతిజ్ఞ పత్రంపై సంతకం చేసి, అవయవదానం పట్ల తన సంపూర్ణ మద్దతును తెలియజేశారు. అనంతరం అవయవదానం ద్వారా పలువురికి పునర్జన్మ ప్రసాదించిన తొమ్మిది మంది అవయవదాతల కుటుంబాలను శాలువాలతో ఘనంగా సత్కరించి, ప్రత్యేకంగా రూపొందించిన “కృతజ్ఞతా పూర్వక” ప్రశంసా పత్రాలతో కూడిన ప్రత్యేకమైన ఫోటో ఫ్రేమ్ లను అందజేసి వారి సేవా త్యాగానికి గౌరవ వందనం అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత విషాద సమయంలో కూడా తమ ప్రియమైన కుటుంబ సభ్యుల అవయవాలను దానం చేయడానికి అంగీకరించిన ఈ కుటుంబాలు నిజమైన మానవతా మూర్తులని కొనియాడారు. తమ వ్యక్తిగత దుఃఖాన్ని అధిగమించి, తెలియని వ్యక్తుల జీవితాలను కాపాడేందుకు తీసుకున్న ఈ మహోన్నత నిర్ణయం సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.”అవయవదానం అనేది మరణానంతరం కూడా జీవితాలను నిలబెట్టే మహాదానం. ఒక అవయవదాత అనేక మంది జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతారు. అలాంటి దాత కుటుంబాలను గౌరవించడం సమాజం యొక్క నైతిక బాధ్యత. వారి త్యాగం మరెందరికో అవయవదానానికి స్ఫూర్తిగా నిలుస్తుంది” అని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320ఇ జిల్లా గవర్నర్ కే.వి ప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అశోక్ ఎర్రమాద, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ వి కుమార్, ఐ డొనేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డా. హరనాథ్ కడిమి కోఆర్డినేటర్ లు చిరునోముల చంద్రశేఖర్, కో ఆర్డినేటర్ కోట సరిత, లయన్స్ సభ్యులు, అవయవదాతల కుటుంబ సభ్యులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ఈ అరుదైన గౌరవం తమ జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిపోతుందని అవయవదాతల కుటుంబ సభ్యులు భావోద్వేగంతో తెలిపారు. తమ కుటుంబ సభ్యుల త్యాగానికి ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ మరియు లయన్స్ క్లబ్ వారు ఇచ్చిన గౌరవం తమకు గొప్ప ఆత్మస్థైర్యాన్ని కలిగించిందని పేర్కొంటూ, జిల్లా కలెక్టర్ కి, లయన్స్ సంస్థకు మరియు కార్యక్రమ నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటికి వెళ్లే దారి అడ్డుకునే కుట్ర, గ్రీవెన్స్ లో కలెక్టర్‌కు ఫిర్యాదు



ప్రజాస్ఫూర్తి,నల్లగొండ: నల్గొండ మండలం దొనకల్లు గ్రామంలో గత సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసి ఓడిన కొత్తపల్లి స్వాతి వెంకటేష్ ఇంటి ముందు ఉన్న 70 గజాల గ్రామ కంట భూమిలో మహిళ సంఘ భవన నిర్మాణం చేపట్టి, ఉద్దేశపూర్వకంగా ఇంటికి ఉన్న దారిని అడ్డుకుంటున్నారని బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం దొనకల్ గ్రామానికి వెళ్లి అట్టి స్థలాన్ని సందర్శించి పరిశీలించిన అనంతరం గ్రీవెన్స్ డే లో కలెక్టర్కు నిర్మాణాలను ఆపాలని ఫిర్యాదు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదగోని శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో పార్టీ నాయకులు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్* కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పోతేపాక సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షులు భోగరా అనిల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాకీ నరసింహ, అసెంబ్లీ కన్వీనర్ గాయం భూపాల్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొత్తపల్లి వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి నరసింహారెడ్డి, యువ మోర్చా రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్ రెడ్డి, మండల నాయకులు కొత్తపల్లి ప్రమోదు, చామకూరి మహేష్, ముత్యాల నాగరాజు గౌడు, వీరమల్ల స్వామి గౌడ్, ముత్యాల శంకర్ రెడ్డి, రేగట్టే రుక్మా గౌడు, బొమ్మిడి శ్రీకాంత్, మర్రి ఏడుకొండలు కొత్తపల్లి శివాజీ మేకల అనిల్ యాదవ్ పగిళ్ల వెంకన్న బడుపుల నగేష్ బూతు అధ్యక్షులు ముప్పిడి సైదులు యస నర్సిరెడ్డి పనస సురేష ఆవుల మధు గాలి శ్రీనివాస్ కిరణ్ కొత్తపల్లి తిరుమలేష్ , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## తల్లిపాలే శిశువు ఆరోగ్యానికి తొలి అడుగు: డీఎంహెచ్‌వో



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజాస్ఫూర్తి): శిశువు ఆరోగ్యకరమైన జీవితానికి తల్లిపాలే తొలి అడుగని, పుట్టిన గంటలోపే ప్రతి శిశువుకు తల్లిపాలు అందించడం అత్యంత ముఖ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా. మధుసూదన్ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, డీఆర్‌డీఏతో పాటు ఇతర శాఖల సిబ్బంది వారోత్సవాల్లో భాగస్వాములవుతున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల పరిధిలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యం, ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాజేంద్ర ప్రసాద్, పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా. సురేందర్, గైనకాలజీ విభాగాధిపతి డా. కవిత, బీడబ్ల్యూఓ మల్లేశ్వరి, ప్రోగ్రాం అధికారి డా. నాగరాణి, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ సేవలు అభినందనీయం

*** హెచ్ఎం భుక్య ప్రసాద్**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : చుంచుపల్లి మండలంలో రాందాస్ తండా ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం భూక్య ప్రసాద్ కోరిక మేరకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకలు , పెన్సిల్స్ , నోట్ బుక్స్ అందజేశారు . ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానానికి వెళ్లాలని ఆయన చిన్నారులను ఆశీర్వదించారు . అనంతరం పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సేవలు అభినందనీయమని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సభ్యులు పాల్గొన్నారు .

## పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాస్

*** భవన నిర్మాణ పనులను పరిశీలించిన అధికారులు**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు సర్పంచ్ చందు నాయక్ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ చేపట్టడం అభినందనీయమని షాద్ నగర్ పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఫరూక్ నగర్ మండలం ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీ లో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను డి ఈ శ్రీనివాస్, ఏఈ గోపాల్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనుల్లో సర్పంచ్ చందు నాయక్ నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. స్టీల్, సిమెంటు, ఇసుక వంటి వస్తువులను ఉపయోగించి భవన నిర్మాణ పనులను చేపట్టడం, నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేయడం అభినందనీయమని సూచించారు. పంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వం 20 లక్షల రూపాయలు మంజూరు చేసిందని, ఈ నిధులకు అనుగుణంగా పనులు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా గ్రామపంచాయతీలో నూతనంగా చేపట్టిన అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను సైతం అధికారులు పరిశీలించారు. సర్పంచ్ చందు నాయక్ చేపట్టిన అభివృద్ధి పనులను చూసి అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అయ్యవారిపల్లి గ్రామం నుండి జయరాం తండా వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించేందుకుగాను చేపట్టనున్న పనులను పరిశీలించారు. బీటీ రోడ్డు నిర్మాణంలో చేపట్టనున్న కల్వర్టులు, వ్యవసాయ పొలాల రైతులతో అధికారులు నేరుగా చర్చించారు. పట్టా భూములు, రోడ్డు నిర్మాణ పనుల్లో ఏమైనా సమస్యలు వస్తున్నాయా అనే విషయాలను సైతం రైతులను అడిగి తెలుసుకున్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతోనే ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీ అభివృద్ధి జరుగుతుందని సర్పంచ్ చందు నాయక్ తెలిపారు. మున్ముందు పంచాయతీ అభివృద్ధిని మరింత చేసేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సర్పంచ్ చందు నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపరిగడ్డ ఉపసర్పంచ్ శ్రీలత తిరుపతయ్య తోపాటు వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి నీల రవీందర్‌కు ఘన సన్మానం



ప్రజాస్ఫూర్తి . షాద్నగర్ : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం నూతన రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన నీల రవీందర్‌కు రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందె సురేష్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నీల రవీందర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన ఆయన ఆర్యవైశ్య యువతను సంఘటితం చేస్తూ, వారి సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం మరింత చురుకుగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ, మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు అనుమారి మురళీధర్, అవోపా రాష్ట్ర నాయకులు పెండ్యాల జగదీశ్వర్, నాయకులు గుడిపాటి విజయ్ కుమార్, జవాడ యశ్వంత్ రాజ్, గద్ద ఆంజనేయులు, వేముల ఆనంద్ బాబు, పెనుగొండ అశోక్ తదితరులు పాల్గొని నీల రవీందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శిగా తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఆర్యవైశ్య యువజన సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువత సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని నీల రవీందర్ తెలిపారు.

# గీతన్నలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : గీత కార్మికుల హక్కులు,సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన "అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర" కేసముద్రంలో జనసంద్రంగా కొనసాగింది. కేజీ కేఎస్ మండల అధ్యక్షులు బబ్బూరి ఉప్పలయ్య,కార్యదర్శి మేడం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మిగౌడ్ అధ్యక్షన ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లాలో ఆదివారం ప్రారంభమైన ఈ యాత్రలో భాగంగా సోమవారం కేసముద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 1,000 ద్విచక్ర వాహనలపై, 2,000 మందికి పైగా గౌడన్నలు,గీత కార్మికులు,యువకులతో ఈ చైతన్య యాత్ర ఘనంగా సాగింది.కేసముద్రం పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గోపా డివిజన్ అధ్యక్షులు, చిలువేరు సమ్మయ్య గౌడ్ కేజీ కేఎస్ రాష్ట్ర బృందానికి గజమాలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం అక్కడి నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఫ్లైఓవర్ మీదుగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంది.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి




నివాళులర్పించారు. అనంతరం జ్యోతిరావు పూలే సెంటర్‌కు చేరుకుని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి యాత్రను కొనసాగించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి,రమణ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని,గీత కార్మికుల సమస్యలను గ్రామస్థాయి నుంచి తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ చైతన్య యాత్ర చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ముందు ప్రధాన డిమాండ్లను ఉంచారు.గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని గతంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. గోపా డివిజన్ అధ్యక్షులు,చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ కేజీ కేఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన గీతన్నల చైతన్య రాష్ట్ర బస్సు యాత్రకు తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. గీత కార్మికుల హక్కులు,సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం పి వి రమణ, బెల్లంకొండా వెంకటేశ్వర్లు ప్రతిపాదించిన న్యాయపరమైన డిమాండ్లను మా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి దృష్టికి మీ కేజీ కేఎస్ అధ్యక్ష కార్యదర్శులతో రాష్ట్ర కార్యవర్గంతో వారిని కలిసి మీరు చేసినటువంటి డిమాండ్ లను వారి దృష్టికి తీసుకువెళ్లి వారి ద్వారా సీఎం రేవంత్ రెడ్డి తో మన సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తానని సమ్మయ్య గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గౌని వెంకన్న,రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు,బన్నీ వెంకట మల్లయ్య , వి. వెంకట నరసయ్య,గౌని సాంబయ్య,చౌగాని సీతారాములు,ఎస్. రమేష్ గౌడ్,ఎస్. వెంకట్ గౌడ్, యమగాని వెంకన్న, గోడం వెంకటేశ్వర్లు, పానుగంటి వీరస్వామి,బుర్ర సుధాకర్,తాళ్లపల్లి నర్సయ్య, బాలబోయిన రాంబాబు,రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


## పివియంఎస్ భద్రాద్రి జిల్లా కన్వీనర్‌గా సుగుణారావు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పారంపర్య వైద్య మహా సంఘం (పీవీఎంఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్‌గా కొత్తగూడెంకు చెందిన ప్రముఖ ప్రకృతి వైద్యులు సుగుణారావు ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్ కాచిగూడలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన నిరంతర వైద్య విజ్ఞాన సదస్సులో భాగంగా రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా కన్వీనర్ సుగుణారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే పారంపర్య అనువంశిక వైద్యులను గుర్తించి వారికి తగిన గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. కాగా సుగుణారావును పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్య, మన్ కి బాత్ మొక్కల రాజశేఖర్, రామవరం పరిరక్షణ సమితి అధ్యక్షులు మహమ్మద్ ముస్తఫా, ప్రకృతి ఆశ్రమం సభ్యులు దశరథ్ రజువా, యల్దండి పూర్ణచందర్ రావు, రావి లక్ష్మీ, శోభారాణి, సాగర్, శంకర్‌లు అభినందించారు. సమావేశంలో సంఘ గౌరవ అధ్యక్షులు సర్జన్ రమేష్, అధ్యక్షులు యాత్రి మహర్షి, ప్రధాన కార్యదర్శి బండి వెంకన్న, ఉపాధ్యక్షులు రామంచి శ్రీనివాస్, భానుప్రసాద్, కోశాధికారి అరుణ, విద్యారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్ కు ప్రాతినిధ్యం ఇవ్వండి

* **రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**




ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ లలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ కు ప్రాతినిధ్యం ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో తమ యూనియన్ కు ప్రభుత్వం ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య దాఖలు చేసిన పిటీషన్ పై హైకోర్టు విచారణ జరిపింది. గత ఆరు మాసాలుగా హైకోర్టులో అనేక దఫాలుగా విచారణ జరిగింది. ప్రభుత్వం తరపు న్యాయవాదులకు, పిటీషనర్ తరపు న్యాయవాదులకు మధ్య వాదనలు జరిగాయి. కేసు విచారణ అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టీస్ మోహినుద్దీన్ లు సోమవారం తీర్పు చెప్పారు.

## గొర్లవీడు1 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గొర్లవీడు 1 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ మందల సరోజన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మందల లావణ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి శిశువుకు గంటలోపే తల్లిపాలు పట్టించాలని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. అనంతరం రెండేళ్ల వయస్సు వరకు అనుబంధ పోషకాహారంతో పాటు తల్లిపాలు అందించడం వల్ల శిశువుల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఏఎన్‌ఎం మాట్లాడుతూ తల్లిపాలలో రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు సమృద్ధిగా ఉంటాయని వివరించారు. అనంతరం గర్భిణీలు, బాలింతలకు బాలామృతం, గుడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు సుజాత, వసంత, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## దళితులపై పాలకులు వివక్ష వీడాలి : సలిగంటి శ్రీనివాస్



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : దళితుల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షపూరిత విధానాలను విరమించి,రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దళితుల సమస్యల పరిష్కారం కోసం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట పేరాల శ్రీనివాస అధ్యక్షతన నిర్వహించిన ధర్నా సందర్భంగా సలిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులతో పాటు తరతరాలుగా నివసిస్తున్న దళితులకు కూడా సమాన హక్కులు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు, అభివృద్ధి అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ అంకిత్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం జిల్లా కార్యవర్గ సభ్యులు గనిగళ్ళ వీరాస్వామి ,విశంశెట్టి పూర్ణచంద్రరావు ,కంచర్ల జమలయ్య, దొంతమాల చెన్నయ్య, కే రత్నకుమారి , పోలమూరు ధనలక్ష్మి , మద్దాల హరిత, జంగం మోహన్ రావు, మామిడాల ధనలక్ష్మి వరుసు రామకృష్ణ పొలామూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి ఎఫ్ టి ఎస్ ఉద్యోగుల సమస్యల పై
# జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాల సమర్పణ

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : ప్రభుత్వం వెంటనే 2026, 27వ ఆర్థిక సంవత్సరానికి భూభారతి ఎఫ్ టి ఎస్ ఉద్యోగుల సేవలను పునరుద్ధరించాలని. భూభారతి ఎఫ్ టి ఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కోఆర్డినేటర్ జానీ పాషా జిల్లా కోశాధికారి నాగరాజులు కోరారు. తెలంగాణ భూభారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ పిలుపుమేరకు భూభారతి యఫ్ టి ఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూభారతి ఎఫ్ టి ఎస్ లో ప్రస్తుతం విధుల్లో ఉన్న 636 మంది ఉద్యోగుల సేవలను యథావిధిగా కొనసాగించాలని వెంటనే వేతనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ఎనిమిది సంవత్సరాలుగా రాష్ట్ర రెవెన్యూ శాఖలో భూసంబంధిత సేవల నిర్వహణలో ఎఫ్ టి ఎస్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు అన్నారు . ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్ టి ఎస్ ఉద్యోగుల సేవలను పునరుద్ధరించాలని,



ప్రస్తుతం విధుల్లో ఉన్న 636 మంది ఎఫ్ టి ఎస్ ఉద్యోగుల సేవలను యథాతథంగా కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 15 నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని, ఐ ఎఫ్ ఎం ఐ ఎస్ పోర్టల్‌లో . ఎఫ్ టి ఎస్ ఉద్యోగుల వివరాలను నమోదు చేసి ప్రతి నెలా సమయానికి వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. అదేవిధంగా భూభారతి పోర్టల్ నిర్వహణలో అనుభవజ్ఞులైన ఎఫ్ టి ఎస్ ఉద్యోగులకు తగిన గుర్తింపు కల్పించి, వారి సేవలను నిరంతరంగా వినియోగించేలా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా కలెక్టర్లు, అదనపు రెవెన్యూ కలెక్టర్లు, కలెక్టరేట్ అధికారులు వినతిపత్రాలను స్వీకరించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు ఉద్యోగుల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఎఫ్ టి ఎస్ ఉద్యోగులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా కోఆర్డినేటర్లు , సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటుతూ ప్రభుత్వానికి తమ విజ్ఞప్తిని వినిపించారు . ఈ కార్యక్రమంలో భారతి ఎఫ్ టి ఎస్ జిల్లా నాయకులు నదీమ్ ,అశోక్ ,నరేష్ ,హర్ష ,బాలాజీ, వాలు ,సతీష్ ,అవినాష్, ,ముబీన్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మచ్చలేని మహోన్నత కమ్యూనిస్టు నేత సున్నం రాజయ్య

* **సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మచ్చలేని మహోన్నత కమ్యూనిస్టు పార్టీ నేత సున్నం రాజయ్య అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని మంచికంటి భవన్‌లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అధ్యక్షతన సున్నం రాజయ్య 6వ వర్ధంతి జరిగింది. ముందుగా రాజయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం కనకయ్య మాట్లాడుతూ ఏజెన్సీ ముద్దుబిడ్డగా ప్రజల మెచ్చిన జననాయకుడిగా




రాజయ్య పేరు తెచ్చుకున్నారని కొనియాడారు.నేటి తరం రాజయ్యను ఆదర్శంగా తీసుకొని నిజాయితీగా నిస్వార్థంగా నిబద్ధతతో ప్రజాసేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం జ్యోతి, కొక్కెరపాటి పుల్లయ్య, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, నాయకులు కాత్రాల తిరుపతిరావు, ఎస్ లక్ష్మీ, ఇందిర, పద్మ, రజిత, రాములు, రఘు, నసూర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలపై సత్వర చర్యలు

* **క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలి**
* **కలెక్టర్ కె. హరిత**

కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: ప్రజావాణిలో స్వీకరించిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్జీదారులకు త్వరితగతిన న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు యువరాజ్ మార్మాట్, ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ప్రజావాణిలో జిల్లాలోని పలు మండలాల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు అందాయి. లింగాపూర్ మండలం పిట్టగూడ గ్రామంలో వర్షాకాలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. పెంచికల్‌పేట్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలని వినతి అందింది. రెబ్బెన మండలం దేవలగూడ వద్ద మూసివేసిన యూ టర్న్‌ను తిరిగి ప్రారంభించాలని



స్థానికులు కోరారు.దహేగాం మండలం కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన సజ్జాత్ అలీ ఖాన్ తమ కుటుంబానికి చెందిన సర్వే నంబర్ 21లోని 12.2320 ఎకరాల భూమికి సంబంధించి విరాసత్ హక్కుల పట్టా మార్పిడిని నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. కెరమెరి మండలం సాంగ్వి గ్రామానికి చెందిన మొహర్లె రమేష్ 2024లో పూర్తి చేసిన సీసీ రోడ్డు పనులకు సంబంధించిన బకాయిలు విడుదల చేయాలని కోరారు. వాంకిడి మండలం గోయాగాం గ్రామంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని నాగదేవత భీమన్న ఆలయం సమీప జాతీయ రహదారిపై తొలగించిన బోర్‌వెల్ స్థానంలో కొత్త బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు వినతి సమర్పించారు. రెబ్బెన మండలం గంగాపూర్‌కు చెందిన పుల్లుభాయి తన మూడెకరాల భూమిలో అటవీ శాఖ మొక్కలు నాటేందుకు ప్రయత్నిస్తున్నందున జాయింట్ సర్వే నిర్వహించి కొత్త పట్టా ఇవ్వాలని కోరారు. గోల్లేటి గ్రామానికి చెందిన జరుపుల జుమ్లిభాయి తన భర్త మృతిచెందిన నేపథ్యంలో ఆయన పేరిట ఉన్న అటవీ హక్కు పత్రాన్ని తన పేరిట మార్చాలని దరఖాస్తు చేశారు. సిర్పూర్ మండలం మహాగావ్ గ్రామానికి చెందిన రాము రైతు భరోసా నిధులు జమ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జై గౌడ్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : హైదరాబాదు రవీంద్రభారతిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి ఉత్సవాలు సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జై గౌడ్ జిల్లా అధ్యక్షులు గుదే వీరన్న గౌడ్ ఆధ్వర్యంలో ఐక్య గౌడ సంఘ నాయకుల సహకారంతో జై గౌడ్ వాల్ పోస్టర్స్ ఆవిష్కరించిన తక్కలపల్లి రవీందర్ రావు ఎమ్మెల్సీ. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సంఘం నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు జేరిపోతుల వెంకన్న గౌడ్, జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, ముత్యం వెంకన్న గౌడ్ గాడిపెల్లి చరణ్ గౌడ్,మోకు దెబ్బ జిల్లా అధ్యక్షులు ముంజల రాజేందర్ గౌడ్,గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్, గోపా జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్, బాలగని నవీన్ గౌడ్, చిర్రగోని ఉదయ గౌడ్, ఉమ్మగానే మధు గౌడ్, యూత్ జిల్లా గౌరవ అధ్యక్షులు నలమాస సాయి గౌడ్,జిల్లా ఉపాధ్యక్షులు గుదే యుగంధర్ గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షులు కాంచాని శంకర్ గౌడ్, నెల్లికుదూరు మండలం అధ్యక్షులు తండ నర్సయ్య గౌడ్, మూల సురేష్ గౌడ్, గాడిపెల్లి అనిల్ గౌడ్, గండి రాజేష్ పాల్గొన్నారు.

## దళితుల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుంది



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కొత్తగూడ మండల కేంద్రంలో జరిగిన మండల కాంగ్రెస్ సమావేశనికి రాష్ట్ర మంత్రి ధన్నసరి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షులు తిప్పర్తి శ్రీధర్ సీతక్కను కలిసి ఎస్సీ విభాగం జిల్లా కమిటీల ఏర్పాటు ప్రమాణ స్వీకార కార్యక్రమం గురించి సీతక్కతో చర్చించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దళితులను కాంగ్రెస్ పార్టీ ని వేరు చేసి చూడలేము అని దళిత సామాజిక వర్గం ఎల్లప్పుడు కాంగ్రెస్ వైపు ఉంటుందని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ని దళిత వాడల్లో బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని దళిత సంక్షేమం కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని అన్నారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో త్వరలో జరగబోయే ఎస్సీ విభాగం పదవుల ప్రమాణ స్వీకారానికి తప్పక హాజరవుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగం పార్టీ మండల బాధ్యులు అయిత అనిల్ కుమార్,చెన్నూరి మహేందర్,సత్యం,వీరస్వామి తదితరులున్నారు.

## పంది పంపుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

* **భూములకు పట్టాలు, రోడ్లు–బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): పంది పంపుల గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గ్రామ ప్రజలు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని 34వ సర్వే నంబర్‌లో దశాబ్దాలుగా సాగులో ఉన్న భూములపై అటవీశాఖ అధికారుల వేధింపులు నిలిపివేసి, అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ లావుడ్య రాధిక కోరారు. దూదేకులపల్లె-పంది పంపుల గ్రామానికి రహదారి నిర్మించాలని, భూపాలపల్లి-పసర బస్సును పంది పంపుల మీదుగా నడపాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పంది పంపుల-సింగారం మధ్య అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో మాజీ ఎంపీపీ శేషాల స్వాతి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్, రైతు సంఘం నాయకుడు దామెర రమేశ్, గ్రామ నాయకులు ఇటుకల ప్రభాకర్, లావుడ్య సమ్మయ్య, రెండ్ల భద్రయ్య, ఎల్లవేని సమ్మయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కాళికాదేవి బోనాల మహోత్సవానికి హాజరుకావాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కు ఆహ్వానం



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 9 వ తేదీ వరకు శ్రీ కాళికాదేవి ఆలయంలో నిర్వహించనున్న కాళికాదేవి బోనాల మహోత్సవానికి మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ను సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ సందర్భంగా మహోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆహ్వానాన్ని స్వీకరించిన దొంతి నరేష్ గౌడ్ మహోత్సవాల విజయవంతానికి తన సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ఏలేశ్వర్ బ్రహ్మచారి, కమిటీ సభ్యులు, సంఘ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# టీబీజీకేఎస్ పోరాట ఫలితమే మణుగూరు ప్రాజెక్ట్ సింగరేణికి దక్కింది

*** టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసాన వీరభద్రం**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం: టీబీజీకేఎస్ పోరాట ఫలితమే మణుగూరు పీకే డీప్ సైడ్ ప్రాజెక్ట్ సింగరేణికి వేలంపాట ద్వారా దక్కిందని టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసాన వీరభద్రం అన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘాలైన ఏఐటియుసి , ఐఎన్ టియుసి సంఘాల వారి వల్లే మణుగూరు డీప్ సైడ్ ప్రాజెక్ట్ సింగరేణికి దక్కిందని వారు అంటున్నారని అలాంటి అసత్యపు ప్రచారాలు చేయవద్దని ఆయన హితువు పలుకుతూ , ఏఐటియుసి,ఐఎన్ టియుసి సంఘాలకు చేతనైతే మిగతా బ్లాక్ లను వేలంపాటలో కాకుండా ప్రభుత్వంపై పోరాటం చేసి డైరెక్ట్ గా సింగరేణి సంస్థకు కేటాయించే విధంగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు . వేలంపాట ద్వారా సింగరేణి దక్కించుకున్న మణుగూరు బ్లాక్ ను వారి వల్లే వచ్చింది అనటం వారి అవివేకానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఏఐటియుసి , ఐఎన్టియుసి సంఘాలు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని , వారు చేసే పనులను కార్మికులు గమనిస్తున్నారని వారికి తగిన సమయం వచ్చినప్పుడు గుణపాఠం చెపుతారని ఆయన అన్నారు . ఇప్పటికైనా కార్మికుల శ్రేయస్సుకోసం పని చేయాలని ఆయన సూచించారు . టీబీజీకేఎస్ సింగరేణి కార్మికులకు ఎన్నో సౌకర్యాలు కల్పించడంతోపాటు , వారి శ్రేయస్సు కోసం పనిచేస్తుందని ఆయన అన్నారు.

# ఎన్ఆర్ఐ దంపతుల ప్రత్యేక పూజలు

*** గోశాలకు దానా బస్తాల విరాళం**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): చారిత్రక కాకతీయుల కళాక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన గణపురం మండలంలోని శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్ళు)లో సోమవారం ఎన్ఆర్ఐ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపురం మండల కేంద్రానికి చెందిన అట్లూరి ఉదయలక్ష్మి-జగన్మోహన్‌రావు దంపతుల కుమార్తె, అమెరికా కాలిఫోర్నియాలో నివసిస్తున్న కె. పునీత్-తులసి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, అర్చనలు చేశారు. ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని గోశాలలోని గోమాతలకు దానా బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు శాలువాలు, పూలమాలలతో దంపతులను సన్మానించి ఆశీర్వచనాలు అందజేయడంతో పాటు తీర్థప్రసాదాలు అందించారు. గోశాలకు దానా బస్తాలు అందజేసిన పునీత్-తులసి దంపతులకు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఓబీసీ మోర్చా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా రంగా శ్రీనివాస్ గౌడ్



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ ఓబిసి మోర్చా కన్వీనర్గా గాంధీనగర్ కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు రంగా శ్రీనివాస్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కె. శేఖర్ యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా అసెంబ్లీ కన్వీనర్‌గా నియమితులైన రంగా శ్రీనివాస్ గౌడ్ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ నందనం దివాకర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నందనం దివాకర్ రంగా శ్రీనివాస్ గౌడ్ ని శాలువాతో ఘనంగా సత్కరించి, నూతన బాధ్యతలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో బిజెపి రంగారెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు మణికంఠ, ఓబీసీ మోర్చా నాయకులు నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజలు డ్రూ గోల్డ్ సంస్థను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ప్రజలు డ్రు గోల్డ్ సంస్థను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది తెలిపారు.సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద గల బిగ్ సి పై మొదటి అంతస్తులో నూతనంగా ఏర్పాటు ఏర్పాటు చేసిన డ్రూ గోల్డ్ రీసైక్లింగ్ 20వ బ్రాంచ్ ను వారు ప్రారంభించి మాట్లాడారు. డ్రూ గోల్డ్ ఏవీపీ (ఆపరేషన్స్) శివకుమారి మాట్లాడుతూ పాత బంగారం, వినియోగంలో లేని బంగారం, తాకట్టులో ఉన్న బంగారాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా నగదుగా మార్చుకునే అవకాశం డ్రూ గోల్డ్ కల్పిస్తోంది అన్నారు. వినియోగదారుల సమక్షంలోనే బంగారాన్ని పరీక్షించి, కరిగించి, తూకం వేసి, అత్యాధునిక సాంకేతికతతో స్వచ్ఛతను నిర్ధారించి, మార్కెట్లో ఉత్తమ ధరను అందిస్తోంది అని తెలిపారు. వినియోగదారులు తమ నగదును బ్యాంక్ ఖాతా ద్వారా వెంటనే పొందవచ్చని, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, పాన్ బ్రోకర్ల వద్ద తాకట్టులో ఉన్న బంగారాన్ని విడుదల చేయించడంలో కూడా డ్రూ గోల్డ్ ప్రత్యేక సహాయం అందిస్తోంది అని తెలిపారు. ఇప్పటికే 30,000 మందికి పైగా వినియోగదారులకు సేవలందించిన డ్రూ గోల్డ్ దేశవ్యాప్తంగా తన విస్తరణను వేగవంతం చేస్తోందని తెలిపారు. 2027 మార్చి నాటికి మరో 15 కొత్త బ్రాంచీలను ప్రారంభించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలోకి కూడా అడుగుపెట్టాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ శ్రీనాథ్, బ్రాంచ్ మేనేజర్ మహేష్, సిబ్బంది శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

*** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆధ్వర్యంలో విదేశీ కలుపు మొక్కల నిర్మూలన కార్యక్రమం ఈకో ఫాన్ సొసైటీ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కలెక్టరేట్ లో విదేశీ దురాక్రమణ కలుపు మొక్కల గుర్తింపు, అవగాహన, నిర్మూలన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,జిల్లా అదనపు కలెక్టర్ నగేష్,అధికారులు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో పెరిగిన విదేశీ దురాక్రమణ కలుపు మొక్కలను గుర్తించి తొలగించారు. సందర్భంగా ఈకో ఫాన్ సొసైటీ ప్రత్యేక గుర్తింపుగా రూపొందించిన “థంబ్స్ డౌన్” సంకేతాన్ని అందరూ ప్రదర్శించారు. ఈ సంకేతం విదేశీ దురాక్రమణ కలుపు మొక్కల వ్యాప్తిని నిరసిస్తూ, వాటిని పూర్తిగా నిర్మూలించి స్థానిక జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలనే సామూహిక సంకల్పానికి ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా మెట్టు సాయి సంపత్, ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఈకో ఫాన్ సొసైటీ మాట్లాడుతూ.. విదేశీ దురాక్రమణ కలుపు మొక్కలు వ్యవసాయ దిగుబడులను తగ్గించడం, సాగుభూములను ఆక్రమించడం, చెరువులు, కుంటలు, కాలువలు వంటి జలవనరులను దిగ్బంధించడం, అడవుల్లో స్థానిక వృక్షజాతులను అణచివేయడం, జీవవైవిధ్యాన్ని తీవ్రంగా దెబ్బతీయడం, కార్చిచ్చుల ప్రమాదాన్ని పెంచడం, రైతులు మరియు గ్రామీణ ప్రజల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వివరించారు.ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రజలు సమన్వయంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.రాష్ట్ర సమన్వయకర్త, ఈకో ఫాన్ సొసైటీ తలారి విక్రమ్ మాట్లాడుతూ తెలంగాణలో విస్తృతంగా వ్యాపిస్తున్న ప్రధాన విదేశీ దురాక్రమణ కలుపు మొక్కలను గుర్తించే విధానాన్ని వివరించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఈకో ఫాన్ సొసైటీ చేపడుతున్న ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించారు. కార్యక్రమం ముగింపులో విదేశీ దురాక్రమణ కలుపు మొక్కల నిర్మూలనకు నిరంతరం కృషి చేయాలని, జీవవైవిధ్య పరిరక్షణ సందేశాన్ని సమాజంలోని ప్రతి వర్గానికి చేరవేయాలని పాల్గొన్న వారందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, కలెక్టరేట్ లోని ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టును పరామర్శించిన మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య



ప్రజాస్ఫూర్తి, సూర్యపేట : మీకు నేను అండగా ఉంటా అంటూ భరోసా.... డాక్టర్ తాటికొండ రాజయ్య... రఘునాథపల్లి.... సీనియర్ జర్నలిస్టు... బీసీ రాజ్యాధికార సమితి జనగాం జిల్లా ప్రచార కార్యదర్శి రఘునాథపల్లి మండల కేంద్రం చెందిన సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం స్టేషన్ ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సోమవారం మధ్యాహ్నం పరామర్శించారు... ఐదు రోజుల క్రితం సీనియర్ జర్నలిస్టు కృష్ణమూర్తి తల్లి మృతి చెందిన విషయం తెలిసిందే... ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య పరామర్శించి చిత్రపటానికి పూలమాలు నిర్వహించారు. రాజయ్య మాట్లాడుతూ మూడు దశబ్దల పాటు జర్నలిస్టుగా పనిచేస్తున్న కృష్ణమూర్తి కుటుంబానికి బి ఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటదని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ కన్వీనర్ మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ మున్సిపట్ల విజయ్, రఘునాథపల్లి సర్పంచ్ బొల్లం ఉమారాణి రాజీవ్, కవాటి రాజయ్య, కృష్ణమూర్తి, రాజేశ్వరి దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# టీబీ నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

*** ప్రతి అనుమానితుడికి పరీక్షలు తప్పనిసరి: కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): జిల్లాలో టీబీ నిర్మూలన లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ప్రతి అనుమానితుడికి స్కిన్ టెస్ట్, ఛాతీ ఎక్స్‌రే, కఫం పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మొబైల్ ఎక్స్‌రే వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనూ టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, మధుమేహం, హెచ్ఐవీ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టీబీ బాధితుల కుటుంబ సభ్యులకు కూడా స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో ప్రత్యేక అధికారులను నియమించి కేసుల గుర్తింపు, పరీక్షలు, చికిత్స, పోషకాహార కిట్ల పంపిణీ తదితర అంశాలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్వో వసంత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్



*** లింగాల ఎంజేపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. సోమవారం రేగొండ మండలంలోని లింగాల ఎంజేపీ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, ఆహార నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలుపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, పోషకాహారం ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.అనంతరం పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎంపీడీవో, ఎమ్మార్వో, పాఠశాల ఉపాధ్యాయులు, భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య స్కూల్ లో మిషన్ హరితోదయ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : శ్రీ చైతన్య స్కూల్, మహబూబాబాద్ 1 బ్రాంచ్ లో ప్రతినెలా నిర్వహిస్తున్న *”స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం”* లో భాగంగా ఈ నెల “మిషన్ హరితోదయ” అనే పేరుతో పర్యావరణ పరిరక్షణ, సామాజిక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారని పాఠశాల ప్రిన్సిపాల్ మదార్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీ,వక్తృత్వ పోటీ, సింగింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించబడ్డాయి. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం చివరి రోజు ముఖ్య అతిథిగా మల్యాల ఆర్టికల్చర్ యూనివర్సిటీ హెడ్ సైంటిస్ట్ డాక్టర్ ఎ.ప్రశాంత్ కుమార్ హాజరై మొక్కలు నాటి,విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ,హరితోదయ ప్రాముఖ్యతను, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో ఎల్‌నినో ప్రభావం నుండి ఎలా బయటపడాలో,రైతులు ఏ పంటలు సాగు చేస్తే మేలు అనే విషయాన్ని వ్యవసాయ కుటుంబ విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలని వివరించారు.అలాగే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని, మొక్కలు మన జాతికి చేసే మేలు గురించి, పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల సిబ్బందిని తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్,డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్ మాధుర్,స్టేట్ అకాడమిక్ కోఆర్డినేటర్ జయరాజు,జోనల్ అకాడమీ కోఆర్డినేటర్ కృష్ణారావు లు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ మదార్, డీన్ విద్యాసాగర్, సి బ్యాచ్ ఇంచార్జ్ మల్లేశం,ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ లు ప్రవల్లిక,షహనాజ్, సి సి ఏ ఇంచార్జ్ కుమారస్వామి,ఏ ఓ సుధాకర్, పి ఈ టీ లు యాకయ్య,రాకేష్ ఉపాధ్యాయ బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పుట్టిన గంటలోపే ప్రతి శిశువుకు తల్లిపాలు అందించాలి

**అంగన్ వాడీ సూపర్ వైజర్ ప్రమీల**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : పుట్టిన గంటలోపే ప్రతి శిశువుకు తల్లిపాలు అందించడం అత్యంత ముఖ్యమని అంగన్ వాడీ సూపర్ వైజర్ ప్రమీల అన్నారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా సోమవారం చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ కాలనీలో అంగన్వాడి సెంటర్ 1 లో తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్ వాడీ సూపర్ వైజర్ ప్రమీల పాల్గొని గర్భిణిలకు, బాలింతలకు తల్లి పాల విశిష్టతను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవని, పుట్టిన ప్రతి బిడ్డకు గంటలోపు తల్లి పాలు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ మమత, ఆశా వర్కర్, బాలింతలు, గర్భిణిలు, మహిళలు పాల్గొన్నారు.

# కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో దోహదం

*** గ్రాండ్ మాస్టర్ కావలి ఎల్లేష్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని విక్టరీ మార్షల్ ఆర్ట్స్ అకాడమి గ్రాండ్ మాస్టర్ కావలి ఎల్లేష్ అన్నారు. సోమవారం చంపాపేట్ గార్డెన్స్ లో జరిగినటువంటి కరాటే పోటీలలో గ్రాండ్ మాస్టర్ కావలి ఎల్లేష్ ఆధ్వర్యంలో విక్టరీ మార్షల్ ఆర్ట్స్ అకాడమి లో శిక్షణ పొందిన 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో గోల్డ్ మోడల్స్ విన్నర్స్ గా గెలుపొందిన విద్యార్థులు 12 సిల్వర్ మెడల్ విన్నర్స్ పొందిన విద్యార్థులు 10 మంది బ్రోంజ మోడల్ విన్నెర్స్ గా గెలుపొందిన విద్యార్థులు ముగ్గురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే దేహ దారుఢ్యంతో పాటు ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టారు కె మహేష్, మాస్టర్ కె నరేష్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై జాప్యం వద్దు

*** జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, ఒక్కో అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, కుటుంబ, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సమర్పించారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని, ప్రతి వినతిదారునికి వారి ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడం మెదక్ జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి భయం, సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

*** ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.ఖానాపురం హవేలీ శివారు టేకులపల్లికి చెందిన వి. వెంకటయ్య ఈ నెల తనకు వృద్ధాప్య పెన్షన్ డబ్బులు జమ కాలేదని తన బ్యాంకు ఖాతాలో ఆ డబ్బులు జమ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డీఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన ఎస్.కే నాజియా తన కుమార్తె తలసేమియా వ్యాధితో బాధపడుతున్నా రని, తన కుమార్తె కు ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డీఓ, సెర్ప్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎం. సూర్య ప్రకాష్ పాపిరెడ్డి ఖమ్మం దేవరపల్లి హైవే ధంసలాపురం ఎంట్రీ ఎగ్జిట్ వద్ద ఉన్న తమ భూమికి దారి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడి ఎన్.హెచ్ అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామానికి చెందిన వి. రామకృష్ణ తాను పి.జీ చదువుకున్నానని తనకు కంటికి సంబంధించిన దివ్యాంగత్వం ఉందని, తనకు ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# తొలిదశ ఉద్యమకారునికి ఘనంగా నివాళులు

*** ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్**



వలిగొండ , ప్రజాస్ఫూర్తి : ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధమల్ల బాలయ్య గుండెపోటుతో సోమవార తెల్లవారుజామున మరణించగా ఆయనకి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన స్వగ్రామంలో జరిగిన అంతిమయాత్రలో పాల్గొని ఆయన పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోలో పొందుపరచిన హామీలను వెంటనే అమలు చేసి ఉద్యమకారులను ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, మొగుళ్ళ శ్రీనివాస్, పలుసం రమేష్,ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, సాయిని యాదగిరి బొడిగెసుదర్శన్, ఐటిపాముల పుష్పమ్మ, మల్లం వెంకటేశం, ఎక్కలదేవి శ్రీనివాస్ ,కదిరేని స్వామి, కన్నెకంటి శ్రీనివాస చారి, కొత్త రామ చందర్ ,దండ మల్లికార్జున్ ,కొండూరు సత్తయ్య, పల్లెర్ల రామచంద్రం, దండ మల్లికార్జున్,ఎదురుగట్ల యాదగిరి, సందయ్య, లక్ష్మయ్య, ఎడవల్లి కిరణ్, తదితరులు పాల్గొన్నారు

# అక్రమ రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోండి

*** వినతి పత్రం అందజేసిన మాజీ కౌన్సిలర్ బాలాజీ సుత్రవే**

ప్రజా స్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా ముధోల్ నియోజవర్గ వ్యాప్త అక్రమ రైస్ మిల్లుల పై చర్యలు తీసుకోవాలంటూ ప్రజావాణి పిర్యాదులలో భాగంగా సబ్ కలెక్టర్ అజ్మీర సాంకేత్ కుమార్‌కి సోమవారం మాజీ కౌన్సిలర్ కపిల్ సిందే వినతి పత్రం అందించారు. ముధోల్ రెవెన్యూ డివిజన్‌లో కొందరు రైస్ మిల్లర్లు ప్రభుత్వం ఇస్తున్న ధాన్యాన్ని పక్క దారి పట్టిస్తూ ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మి అక్రమ మార్గంలో డబ్బు సంపాదిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. బ్లాక్ లిస్ట్‌లో ఉన్న డిఫాల్టర్ రైస్ మిల్లులకు సైతం ధాన్యం ను కేటాయిస్తున్నారని, అవినీతికి పాల్పడుతున్న



ప్రభుత్వ అధికారులు రైస్ మిల్లుల గోదాంలను తనిఖీలు నిర్వహించడం లేదంటూ తెలిపారు. రైస్ మిల్లుల యాజమాన్యానికి రాజకీయ నాయకుల అండదండలు లభించడం వల్ల అధికారులు ఇటు వైపు చూడటం లేదని సబ్ కలెక్టర్‌కి తెలిపారు. ఈ విషయంలో విజిలెన్స్ అధికారులతో రైస్ మిల్లులపై విచారణ చేసి ప్రభుత్వపరంగా రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని, ఈ మిల్లుల అనుమతులను రద్దు చేయాలని కోరారు. ఈ వినతి పత్రం అందించిన వారిలో బాలాజీ సూత్రవే, రమేష్ ఉన్నారు.

# పదవి విరమణ పొందిన ఉద్యోగులను సన్మానించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : దీర్ఘకాలంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఘనంగా సన్మానించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూలై 31 నాటికి పదవి విరమణ పొందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి.శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు.మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ లో అసిస్టెంట్ సిడిపిఓ గా పని చేస్తున్న జే.రత్నకుమారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయ డ్రైవర్ సి.హెచ్. నాగరాజు పదవి విరమణ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సుమారు 30



నుంచి 35 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిర్విరామంగా సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న అధికారులకు , సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత వారు జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యవంతంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు పదవి విరమణ పొందిన వారినీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, డిడబ్ల్యుఓ ఏ.ప్రమీల, జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, పదవి విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృత అవగాహన కల్పించాలి

**: జిల్లా కలెక్టర్**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ ఆహారమని తెలిపారు. శిశువు పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు




మాత్రమే పట్టించేలా ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఆరు నెలల కాలంలో శిశువు ఎదుగుదల, అభివృద్ధికి, రోగ నిరోధక శక్తికి అవసరమైన అన్ని పోషకాలు తల్లిపాలలోనే లభిస్తాయని అన్నారు. గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తూ ప్రతి శిశువుకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారి ఎ. ప్రమీల, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, పోషణ్ అభియాన్ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

*** జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ముఖ్య అతిథి ప్రసంగాన్ని ఆగస్టు 11 నాటికి సిద్ధం చేయాలని తెలిపారు. ప్రతి శాఖ తమ శాఖలో చేపట్టిన ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాలను సంక్షిప్తంగా పొందుపరిచిన నివేదికలను ఆగస్టు 8 లోగా డీపీఆర్వోకి అందజేయాలని



ఆదేశించారు. సౌండ్ వ్యవస్థ ఏర్పాట్ల బాధ్యతను ఖమ్మం అర్బన్ తహసీల్దార్ చేపట్టాలని, సౌండ్ సిస్టమ్ ఏర్పాట్లను డీపీఆర్వో ముందస్తుగా పరిశీలించి నిర్ధారించాలని సూచించారు. స్టాల్స్‌ను ఆగస్టు 15 ఉదయం 6 గంటలకల్లా సిద్ధం చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాల్లో వినిపించే పాటలను ముందుగానే ఎంపిక చేసి ఒక్కో పాట మూడు నుంచి నాలుగు నిమిషాలకు మించకుండా చూడాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు తాజా నివేదికలతో వేడుకలకు హాజరు కావాలని తెలిపారు.ప్రశంసా పత్రాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఆగస్టు 12 లోగా పంపించాలని, అగ్నిమాపక వాహనం సిద్ధంగా ఉంచాలని, అవసరమైన మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే పాఠశాల విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వాచ్మేన్ కుటుంబానికి ఆర్థిక సహాయం

వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గత మూడు సంవత్సరములుగా వాచ్మేన్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీ కట్టంగూరి నర్సయ్య గౌడ్ ఇటీవల అనారోగ్య కారణంగా మరణించారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకోజు భాస్కర్ , ఉపాధ్యాయ బృందం మానవతావాద దృక్పథంతో స్పందించి సోమవారం జరిగిన దశదిన కర్మలో పాల్గొని ,నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి ఆ



కుటుంబానికి తమవంతుగా ఇరవై ఒక్క వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోలేపాక నాగేందర్ ,కే సైదా రెడ్డి ,ఐ గోపి ,ఏ శ్రీనివాస్ ,జె విజయనిర్మల ,కే వెంకటేశ్వర్లు ,పి స్వామి, కె నవీన్ కుమార్ ,సిహెచ్ కవిత ,ఆర్ శివాజీ ,ఏ చంద్రకళ ,ఎం మల్లేశం, కే లక్ష్మి, ఇ. వెంకటేశం ,గులాం జిలాని ,ఎస్ లింగయ్య ,జీ స్వామి రాజ్ ,ఎం శారద బి రవీందర్ ,ఎం డి . అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# గోరుకొత్తపల్లి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


*** మండల స్థాయి సమీక్షలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశం**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): గోరుకొత్తపల్లి మండలంలో సంక్షేమ పథకాల అమలు, గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. సోమవారం మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.మండలంలోని అన్ని శాఖల సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించిన ఎమ్మెల్యే, గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామ అవసరాలను గుర్తించి, సర్పంచులతో సమన్వయం చేసుకుంటూ కార్యాచరణ రూపొందించి గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, ప్యాక్స్ చైర్మన్ నడిపెల్లి విజన్‌రావు, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌళిక వసతులు కల్పించాలి

*** రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : రానున్న పదేళ్లలో ఖమ్మం నగరం మరింత విస్తరించనున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌళిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. సోమవారం రఘునాథపాలెం మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద నూతనంగా రూ.3.62 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఖమ్మం నగర అభివృద్ధి వేగంగా జరుగుతున్న నేపథ్యంలో రాబోయే విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. రానున్న పదేళ్ల అవసరాలను అంచనా వేసి అదనపు విద్యుత్ ఉపకేంద్రాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం ఖమ్మం నగరానికి 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రం అత్యవసర అవసరమని పేర్కొన్న మంత్రి, ఉపకేంద్రం ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూమిని వెంటనే గుర్తించి, ఎక్కడ నిర్మించాలనే అంశంపై ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. స్థల ఎంపిక, అంచనా వ్యయం, సాంకేతిక ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి తక్షణమే పంపించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీఓ శ్రీనివాస్, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా చైర్మన్ గా రాయల సురేష్ నియామకం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఎం ఆర్. హ్యూమన్ రైట్స్ మానవ హక్కుల అవినీతి వ్యతిరేక అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా చైర్మన్ గా రాయల సురేష్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మానవ హక్కుల అవనీతి నేషనల్ ఫౌండర్ గుండారెడ్డి మల్లికార్జునరెడ్డి, నేషనల్ బోర్డు డైరెక్టర్ రోడ్డ తిరుపతయ్య, జాతీయ అభివృద్ధి బోర్డు నేషనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రావు, మానవ హక్కుల అవినీతి నిర్మూలన నేషనల్ సెక్రెటరీ విష్ణు , జాతీయ అభివృద్ధి బోర్డ్ జనరల్ సెక్రటరీ. అంబాల కుమారస్వామి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర చైర్మన్లు వివిధ జిల్లాల వైస్ చైర్మన్ లు సమావేశంలో పాల్గొన్నారు.



# మధుర పరిమళాల మనోహరం!

ప్రకృతి ఒడిలో వికసించే పూలలో కొన్ని కేవలం అందాన్ని ఇస్తే, మరికొన్ని మధురమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. కానీ, ఈ రెండింటినీ రంగరించుకున్న అద్భుతమైన తీగ మొక్క 'హనీసకల్'.





హనీసకల్ అనగానే మనకు గుర్తొచ్చేది దాని విలక్షణమైన పూల ఆకారం. గొట్టం ఆకారంలో ఉండే ఈ పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. ఈ పూల అడుగు భాగంలో ఉండే మకరందం అత్యంత తీపిగా ఉండటం వల్ల దీనికి 'హనీసకల్' అనే పేరు వచ్చింది. పూలు... తెలుపు, పసుపు, ఎరుపు, పింక్ నారింజ రంగులలో విచ్చుకుంటాయి. ఈ పూల తీపి వాసన సీతాకోకచిలుకలను, తేనెటీగలను హమ్మింగ్ బర్డ్స్‌ను ఆకర్షిస్తుంది. సువాసనలు వెదజల్లే ఈ పూలలో కొన్ని రకాలు... సాయంత్రం వేళల్లో మరింత గాఢమైన సుగంధాన్ని విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 రకాల జాతుల్ని కలిగిన హనీసకల్ మొక్కది వేల ఏళ్ల చరిత్ర. ప్రాచీన చైనా వైద్య శాస్త్రంలో దీన్ని కీలకంగా వాడతారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరచడానికీ, విష పదార్థాలను బయటకు పంపడానికీ ఉపయోగిస్తారట. బ్రిటన్‌లో విక్టోరియన్ కాలంలో ఈ పూలను ప్రేమకు, విశ్వాసానికి చిహ్నంగా, పెళ్లిలో వధువు ఈ పూలను పెట్టుకోవడం శుభసూచకంగానూ భావించేవారట. అందుకేనేమో... షేక్స్‌పియర్ వంటి ప్రముఖ కవుల రచనల్లో ఈ పూల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది.

**తేమ అవసరమే కానీ...**

ఈ మొక్కకు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండ అవసరం. ఎండ తక్కువైతే పూలు తక్కువగా పూస్తాయి. నీరు నిల్వ ఉండని సారవంతమైన నేలలు దీనికి అనుకూలం. ఇవి తీగ జాతి మొక్కలు కాబట్టి, పాకడానికి గోడలు, ఫెన్సింగ్ లేదా ట్రెల్లీస్ వంటి ఆధారాల్ని కల్పించాలి. మొక్క నాటిన కొత్తలో క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. ఎదిగిన తర్వాత నేల పైపొర ఆరిపోయినప్పుడు మాత్రమే నీరు పోయాలి. వేర్ల దగ్గర తేమ ఉండాలి కానీ నీరు నిలిచిపోకూడదు. శీతకాలం చివరలో లేదా వసంతకాలం మొదట్లో మొక్కను కత్తిరించాలి. ఎండిపోయిన






కొమ్మలను తొలగించడం వల్ల కొత్త చిగుళ్లు వచ్చి పూలు ఎక్కువగా పూస్తాయి. ఏడాదికి రెండుసార్లు కంపోస్ట్ లేదా స్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్లను అందించాలి. ఈ మొక్కకు పిండి నల్లి, తెల్లదోమ, బూజు తెగులు వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటిని దూరం చేయడానికి ఫంగిసైడ్‌తో పాటు వేపనూనె పిచికారీ చేయవచ్చు. దానికంటే ముందుగా వ్యాధిసోకిన కొమ్మలు, ఆకులను కత్తిరించి దూరంగా పారేయడం మంచిది. ఈ జాగ్రత్తలతో మొక్క ఆరోగ్యంగా నిండుగా పూస్తుంది.

# చెమట పడితే మంచిదేనట!

వేసవిలో వేడికి తట్టుకోలేక శరీరం చెమటలు పట్టడం సహజమే! అయితే ఇలా చెమటలు రావడం వల్ల చిరాగ్గా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ఆశ్రయిస్తుంటాం. నిజానికి శరీరం నుంచి చెమట బయటికి రాకుండా ఎప్పుడూ ఇలా చల్లటి వాతావరణంలో గడపడం కంటే.. కాస్త చెమట పట్టనివ్వడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..



**వడదెబ్బ తగలకుండా..!**

ఎండాకాలంలో కాసేపు బయట గడిపినా, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వడదెబ్బ తగులుతుంటుంది. అయితే చెమటలు పట్టడం వల్ల వడదెబ్బ నుంచి కొంతవరకు రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. చెమట మన శరీరానికి సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఎండ వేడి శరీరంలోకి వెళ్లకుండా చెమట అడ్డుపడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. ఇక ఈ కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం, శరీరానికి చలువ చేసే పదార్థాల్ని తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.

**రోగనిరోధక శక్తికి!**

స్వేద గ్రంథులు విడుదల చేసే చెమట రోగనిరోధక శక్తినీ పెంచుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇందుకు స్వేద గ్రంథుల్లో ఉండే యాంటీమైక్రోబియల్ పెప్టైడ్లే కారణమట! ఇవి వ్యాధులకు కారణమయ్యే క్రిములతో పోరాడి.. సహజ రక్షణ కల్పిస్తాయి అంటున్నారు నిపుణులు.

**ఇవి కూడా!**

* వ్యాయామం చేసే క్రమంలో చెమట పడుతుంది. తద్వారా శరీరం చల్లబడడంతో పాటు ఎండార్ఫిన్లూ విడుదలవుతాయి. ఫలితంగా శారీరక నొప్పులు, ఒత్తిళ్లు తగ్గి ప్రశాంతంగా ఉండచ్చు అంటున్నారు నిపుణులు.
* శరీరం చెమట పట్టినప్పుడు చర్మ గ్రంథులు తెరుచుకుంటాయి. తద్వారా చర్మ రంధ్రాల్లో గాలి బాగా ఆడుతుంది. అలాగే శరీరంలోని మలినాలూ చెమట రూపంలో బయటికి వచ్చేస్తాయి. వీటివల్ల చర్మం ఎప్పటికప్పుడు శుభ్రపడుతుందట.

గమనిక : అయితే ఇలా చెమట పట్టడం మంచిదే అయినా.. ఎక్కువసేపు ఇలాగే ఉండడం వల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని దుమ్ముధూళి చెమటతో కలిసి చర్మ రంధ్రాల్లోకి చేరడం వల్ల మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చెమట పట్టిన వెంటనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు.

# వేసవి తాపాన్ని తగ్గించే జల్ జీరా!

ఎండా కాలం వచ్చిందంటే చాలు దాహంతో అల్లాడిపోతుంటాం. ఈ సమయంలో కృత్రిమమైన కూల్ డ్రింక్స్, సోడాలను తాగే బదులు ఓ గ్లాస్ జల్ జీరా తాగి చూడండి. ఇది దాహం తీర్చడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా ఇందులోని జీలకర్ర జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరానికి అవసరమైన ఇనుమూ అందుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పి, తిమ్మిర్ల నుంచి ఈ పానీయం ఉపశమనం కలిగిస్తుంది. ఇక, ఇందులోని నల్ల ఉప్పు... శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. అందుకే, ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఒక గ్లాసు జల్ జీరా తాగి చూడండి. ఆ అలసట తక్షణమే మాయమవుతుంది. వేయించిన జీలకర్ర, కొద్దిగా అల్లం ముక్క, పుదీనా ఆకులు, పచ్చిమిర్చి (అవసరమైతే) కలిపి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటిలో కలిపి, తగినంత నల్ల ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, నిమ్మరసం కలపాలి. చివరగా కొద్దిగా బూందీ చల్లుకుంటే సరి. రుచికరమైన జల్ జీరా తయారైనట్లే. సహజ సిద్ధమైన ఈ పానీయం పెయిన్ కిల్లర్‌లానూ పనిచేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తక్కువ కెలొరీలు ఉండి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడటం వల్ల బరువు తగ్గాలనుకునే మహిళలకు మంచి ఎంపిక.





# ఇలా... ప్రకృతికి చేరువగా!

**అపార్ట్‌మెంట్లలో ప్రతి చదరపు అడుగూ విలువైనదే. ఆయా గదుల్ని వినియోగం పరంగా ప్రత్యేకంగా మార్పులు చేసుకోలేం కానీ, బాల్కనీ అందుకు మినహాయింపు. అందుకే దీన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామనేది ముఖ్యం. ప్రకృతికీ, పచ్చదనానికీ చేరువయ్యేందుకు ఇదో దగ్గర మార్గం. అందుకోసం ఏం చేయాలంటే...**

కాసేపు ఎండ పట్టడం, తీరిగ్గా కూర్చొని కప్పు కాఫీ తాగడం, ధ్యానం చేసుకోవడం... అన్నింటికీ ఒకటే చోటు... బాల్కనీ. చూశారా ఇది ఎంత ముఖ్యమైందో! అందుకే దీన్ని చిన్నపాటి పార్కుగా మార్చేయాలి. అప్పుడే ప్రకృతిలోకి వెళ్లాలనుకున్నప్పుడల్లా అక్కడ కాసేపు కూర్చొని సేదతీరొచ్చు.

* నిలువుగా పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి. అవి పాకేందుకు వీలుగా ఏర్పాట్లుచేయాలి. ఇవి గాలిని శుద్ధి చేస్తాయి. అలాగే ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
* తరచూ మార్చాల్సిన పనిలేకుండా ఎండలూ, వర్షాలకు తట్టుకునే మెటీరియల్‌ని అక్కడ ఉపయోగించాలి. అందుకు గట్టి కుండీలు, మెటల్‌తో చేసిన వస్తువులు ఎంచుకోవడం మేలు.
* ఇన్విజబుల్ నెట్టింగ్ బార్‌ని ఉపయోగించి పావురాలను దూరం పెట్టండి. అక్కడ కూర్చునేందుకు ప్రత్యేకంగా చిన్న సైజు కుర్చీల్ని వినియోగించండి.
* చీకటిపడ్డాక పెద్ద లైట్లు కాకుండా చిన్న సోలార్ లాంతర్లు వాడండి. వాటిని మొక్కల మధ్యన ఉంచితే ఇంకా మంచిది.



# అలియాస్ రుక్మిణి గ్లింప్స్ రిలీజ్

నితిన్ హీరోగా నాచురల్ స్టార్ నాని నిర్మాణంలో ఓ సినిమా రాబోతుంది. ఈ మూవీ టైటిల్‌తో పాటు గ్లింప్స్‌ను సోమవారం రిలీజ్ చేశారు. ఈ సినిమాకు అలియాస్ రుక్మిణి అనే పేరును ఖరారు చేశారు. హీరో నాని, డైరెక్టర్ మురళీ వాయిస్ ఓవర్‌తో ఈ గ్లింప్స్ ఆసక్తిని పంచింది. ఇందులో కృష్ణ అనే పాత్రలో నితిన్ కనిపించబోతున్నట్లు చూపించారు. గరం గోపాల్, ఆమెకు ఆమె అంటే ఇష్టం, వ్రతం వెంకన్న అనే రచనలను రుక్మిణి రాసినట్లుగా గ్లింప్స్‌లో కనిపించింది. నితిన్‌కు జోడీగా బాలీవుడ్ బ్యూటీ ఆఫియా సయీద్ హీరోయిన్‌గా నటిస్తోన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీప్తి ఘంటా ఈ మూవీని నిర్మిస్తున్నారు. నేటి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలైనట్లు సమాచారం.



## బుట్టబొమ్మ పెళ్లికి చాలా టైముందట

బుట్టబొమ్మ పూజా హెగ్డే పెళ్లిపీటలు ఎక్కబోతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రియుడు రోహన్ మెహ్రాతో ఈ ఏడాదే ఏడడుగులు వేయబోతున్నట్లు చెబుతున్నారు. చాలా కాలంగా సాగుతోన్న తమ ప్రేమ బంధాన్ని పెళ్లి పీటలపైకి తీసుకెళ్లేందుకు ఈ జంట రెడీ ఐనట్లు సమాచారం. ఈ రూమర్లపై పూజా టీమ్ క్లారిటీ ఇచ్చింది.పెళ్లి వార్తల్లో నిజం లేదు. ఈ రూమర్లు ఎలా వచ్చాయో, ఎవరూ క్రియేట్ చేశారో తెలియదు. అవన్నీ అవాస్తవాలే. నిరాధారమైన వార్తలను ప్రచారం చేయద్దు. పూజా పెళ్లికి ఇంకా చాలా టైమ్ ఉంది. ఆ రోజు వస్తే తనే స్వయంగా అందరితో ఆ గుడ్‌న్యూస్‌ను పంచుకుంటుంది అని ఆమె టీమ్ పేర్కొంది. ప్రస్తుతం తెలుగులో శ్రీశ్రీ అనే సినిమాలో దుల్కర్ సల్మాన్‌కు జోడీగా కనిపించబోతోంది ఈ సొట్టబుగ్గల సుందరి.






## బిగ్‌బాస్ అగ్నిపరీక్ష.. డేట్ ఇదే

బిగ్‌బాస్ తెలుగు సీజన్ 10 కౌంట్‌డౌన్ మొదలైంది. బిగ్‌బాస్ అగ్నిపరీక్ష ప్రీమియర్స్ డేట్స్‌ను సీజన్ 9 విన్నర్ కళ్యాణ్ పడాల రివీల్ చేశాడు. ఆగస్ట్ 15 నుంచి జియో హాట్‌స్టార్‌తో పాటు స్టార్ మాలో అగ్నిపరీక్ష ప్రీమియర్ కానున్నట్లు వెల్లడించారు. ఓ ప్రోమో వీడియోను రిలీజ్ చేసి సాధారణ వ్యక్తిగా అసాధారణ కలలతో తన ప్రయాణాన్ని ప్రారంభించి, బిగ్‌బాస్ విజేతగా ఎదిగిన తీరుని వివరించాడు. గత సీజన్‌లో కామన్ మ్యాన్స్ సెలెక్షన్ కోసం బిగ్‌బాస్ అగ్నిపరీక్షను నిర్వహించారు. ఇందులో విన్నర్‌గా నిలిచిన కంటెస్టెంట్లు బిగ్‌బాస్ హౌజ్‌లోకి అడుగుపెట్టారు. బిగ్‌బాస్ సీజన్ 10 సెప్టెంబర్ ఫస్ట్ వీక్ నుంచి లాంచ్ కాబోతుంది.



## 40 లక్షలు అందుకే అడిగాం

జయం రవి, ఆర్తి మధ్య విడాకుల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. జయం రవి నుంచి నెలకు 40 లక్షలు తాత్కాలిక భరణం కోరుతూ ఆర్తి పిటీషన్ వేయగా కోర్టు కొట్టేసింది. ఈ తీర్పుపై ఆర్తి తల్లి కోలీవుడ్ ప్రొడ్యూసర్ సుజాత విజయ్ కుమార్ రియాక్ట్ అయ్యారు. జయం రవి అబద్ధాల కోరు అంటూ కామెంట్లు చేసింది. ఆర్తి పిల్లలు అమెరికన్ స్కూల్‌లో చదువుతున్నారు. వారి ఏడాది ఫీజు కోటి వరకు అవుతుంది. రెండేళ్లుగా ఆ ఫీజులు నేనే భరిస్తున్నా. అందుకే 40 లక్షలు తాత్కాలిక భరణంగా అడగాం. నిజాలు తెలుసుకోకుండా ఆర్తిదే తప్పంటూ విమర్శిస్తున్నారు. పిల్లలను కలవకుండా చేస్తున్నామంటూ జయం రవి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రతి వీకెండ్స్‌లో పిల్లలను కలవవచ్చు. కానీ రవి రావడం లేదు. ఆర్తి హక్కుల కోసమే పోరాడుతోంది. ఆస్తుల కోసం కాదు అని సుజాత చెప్పుకొచ్చారు.

## 41 గంటలు నిద్రపోలే

సినిమాల కోసం కీర్తి సురేష్ పడుతోన్న కష్టం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఆమె ఇన్‌స్టాలో ఓ పోస్టు పెడుతూ వివరంగా రాసుకొచ్చింది. నాన్‌స్టాప్ షూటింగ్‌ల కారణంగా 41 గంటలు నిద్ర పోలేదని అన్నది. ఓ షూటింగ్ కంప్లీట్ అయిన తర్వాత మరో షూటింగ్.. 41 గంటలు మెలకువగా ఉంటూ పనిచేస్తూనే ఉన్నా. కనీసం సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టడానికి కూడా ఓపిక లేదు అంటూ అలసిపోయి కనిపిస్తున్న ఓ ఫొటోను అభిమానులతో పంచుకుంది. అయితే నాని ప్యారడైజ్ మూవీలో స్పెషల్ సాంగ్ కోసమే కీర్తి కష్టపడుతోందని ఫ్యాన్స్ కామెంట్లు పెడుతూ ప్రశంసలు కురిపించారు. కాగా ప్రస్తుతం తెలుగులో విజయ్ దేవరకొండ రౌడీ జనార్ధనలో హీరోయిన్‌గా నటిస్తోంది కీర్తి.

## స్పైడర్‌మ్యాన్ సంచలనం.. ఒడిస్సీ రికార్డుకు చెక్

టామ్ హాలండ్ నటించిన స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొడుతోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ది ఒడిస్సీ చిత్ర వసూళ్లను అధిగమించింది. భారత్‌లో ఈ చిత్రం రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి దేశంలో అత్యంత భారీ ఓపెనింగ్ అందుకున్న హాలీవుడ్ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. నాలుగో రోజు భారత్‌లో రూ.306.37 కోట్ల గ్రాస్, రూ.256.20 కోట్ల నెట్ కలెక్షన్లు నమోదు చేసినట్లు ట్రేడ్ ట్రాకర్ శాక్‌నిల్క్ తెలిపారు. ఆదివారం ఒక్కరోజే 18,051 షోల ద్వారా రూ.76 కోట్ల నెట్ వసూలు చేయగా, తొలి వీకెండ్ కలెక్షన్లు రూ.250 కోట్ల మార్క్‌ను దాటాయి. ప్రపంచవ్యాప్తంగా తొలి వీకెండ్‌లో సుమారు రూ.8,100 కోట్లు వసూలు చేసింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.